సాక్షి
ఖమ్మం
సోమవారం । 5 ఫిబ్రవరి । 2024



అంతర పంటలతో ఆసరా..

ఉద్యాన తోటలు సాగు చేస్తున్న రైతులు వాటిలో అంతర పంటలుగా కూరగాయలు, అపరాలు వేస్తూ ఆదాయం గడిస్తున్నారు. 10లో



దాబాల్లో అసాంఘిక చర్యలు

ఖమ్మం నగర పరిసర ప్రాంతాల్లోని పలు దాబాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. 8లో

గరిష్టం / కనిష్టం
35° / 18°

వాతావరణం

జిల్లాలో సోమవారం పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి వాతావరణం కొంత చల్లగానే ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు జిల్లాలో మంత్రి తుమ్మల పర్యటన

ఖమ్మంవన్‌టౌన్ : రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 6 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి 9 గంటలకు నగరంలోని 13వ డివిజన్ మధురానగర్‌కు చేరుకుని పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. 10 గంటలకు ప్రభుత్వ మెడికల్ కళాశాలను సందర్శిస్తారు. 11 గంటలకు వీడీఓస్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. 12 గంటలకు 45, 39, 25, 24వ డివిజన్లలో, 1 గంటకు బొక్కలగడ్డ 47వ డివిజన్‌లో ఏర్పాటుచేసే కార్యక్రమాల్లో పాల్గొంటారు. మంగళవారం ఉదయం 11 గంటలకు గాంధీచౌక్, 12 గంటలకు 35వ డివిజన్ మోతీనగర్‌లో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

7న ప్రధానమంత్రి విశ్వకర్మ సదస్సు

కలెక్టర్ గౌతమ్ వెల్లడి

ఖమ్మం సహకారనగర్ : నగరంలోని టీటీడీసీ సమావేశ మందిరంలో ఈనెల 7వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రధానమంత్రి విశ్వకర్మపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన చేశారు. సంప్రదాయ /అసంఘటిత రంగంలో స్వహస్తాలతో లేదా పరికరాలతో ఉత్పత్తులు తయారు చేసే వారు తమ వృత్తుల్లో ఆధునిక ఉపకరణాలు వినియోగించి మరింత నైపుణ్యంగా తయారు చేసే ఉద్దేశంతోనే ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు వివరించారు. వృత్తి, హస్త కళాకారులు తమ సంప్రదాయాన్ని పరిరక్షిస్తూ, మరింత అభివృద్ధి చేసేందుకు ఈ సదస్సు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ పథకంతో జిల్లాలో అధిక సంఖ్యలో ఉపాధి అవకాశాలు లభిస్తాయని, సదస్సులో సంబంధిత శాఖల అధికారులు, బ్యాంకర్లు పాల్గొంటారని తెలిపారు. కమ్మరులు, స్వర్ణకారులు, కుమ్మరులు, వడ్రంగులు, శిల్పులు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న గౌరీశంకరి

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో కొనసాగుతున్న నిత్యాన్నదాన పథకం నిర్వహణకు ఆదివారం ఏపీ రాష్ట్రం గుంటూరుకు చెందిన మాచవరపు గౌరీశంకరి రూ.లక్ష చెక్కు ఆలయ సూపరింటెండెంట్ కె.విజయకుమారికి అందించారు. అనంతరం శ్రీస్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనకు స్వామివారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల విజయ దేవశర్మ, సిబ్బంది వంశీ, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

అంజనాద్రి క్షేత్రానికి ఎకరం పొలం




అర్చకుడికి పొలం పత్రాలు అందజేస్తున్న దాత

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు - బుచ్చిరెడ్డిపాలెం గ్రామాల మధ్య గల అంజనాద్రి ఆలయానికి మధిర మండలం వంగవీడు గ్రామానికి చెందిన చీదిరాల సత్యనారాయణ - కృష్ణవేణి దంపతులు ఎకరం భూమిని వితరణగా అందజేశారు. ఆలయాభివృద్ధి కోసం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు సత్యనారాయణ దంపతులు తెలిపారు. కాగా, వారిని స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జంగా పుల్లారెడ్డి, యరమల శ్రీనివాసరెడ్డి, సొసైటీ చైర్మన్ శీలం అక్కిరెడ్డి, ఆలయ అర్చకులు వేదాంతం రాధాకృష్ణ మూర్తిచార్యులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో ఆదివారం స్వర మాధురి కల్చరల్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సినీ సంగీత విభావరి అలరించింది. పలు ప్రాంతాలకు చెందిన గాయనీ, గాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ గానామృతంతో ప్రేక్షకులను ఆనందింపజేశారు. కార్యక్రమాన్ని సంస్థ అధ్యక్షుడు ఇసనపల్లి నగేష్ నిర్వహించారు.

ఈ సీటు.. వెరీ హాట్



కాంగ్రెస్ పార్టీలో ఖమ్మం పార్లమెంట్ టికెట్ కోసం పోటాపోటీ నెలకొంది. పలువురు ఆశావహులు ఈ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆ పార్టీ నేత వి.హన్మంతరావు, రేణుకాచౌదరితో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సతీమణి నందిని, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు ప్రసాద్‌రెడ్డి, ఇంకా పలువురు ముఖ్యనేతలు టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో ఉన్నారు. పార్టీ అగ్రనేత సోనియాగాంధీ ఈ స్థానం నుంచి పోటీ చేయాలని కోరుతూ ఇప్పటికే టీపీసీసీ ఏఐసీసీకి ప్రతిపాదన పంపింది. అయితే ఆమె ఇక్కడి నుంచి పోటీ చేయకపోతే దరఖాస్తు చేసుకున్న హేమాహేమీల్లో ఎవరికి టికెట్ దక్కుతుందోనన్న ఉత్కంఠ పార్టీ శ్రేణుల్లో ఉంది.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

ఖమ్మం లోక్‌సభ స్థానానికి పోటాపోటీ

- కాంగ్రెస్ నుంచి టికెట్ కోసం ఆశావహుల దరఖాస్తు
- రేసులో రేణాకాచౌదరి, భట్టి సతీమణి, పొంగులేటి సోదరుడు
- ఇక్కడి నుంచే సోనియా పోటీ చేయాలని పీసీసీ తరఫున విన్నపం
- ఆమె కాదంటే టికెట్ ఎవరికో అనే ఉత్కంఠ

సోనియా కాకపోతే మరెవరు..?

ఖమ్మం పార్లమెంట్ స్థానంలో పార్టీ అగ్రనేత సోనియాగాంధీని బరిలోకి దింపాలని టీపీసీసీ ఇటీవల ఏఐసీసీకి ప్రతిపాదన పంపింది. దీనిపై ఏఐసీసీ ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు. ఆశావహ నేతలంతా సోనియాగాంధీ ఖమ్మం నుంచి పోటీకి దిగేందుకు జై కొడుతూనే.. తమ నేత ఈ స్థానం నుంచి పోటీ చేయకపోతే తామే బరిలో ఉంటామని ఎవరికివారు ఆశల పల్లకీలో ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి పోలైన ఓట్లను బేరీజు వేసుకుని సోనియాగాంధీని ఈ స్థానం నుంచి పోటీ చేయిస్తే గెలుపు కోసం అంతగా కష్టపడాల్సిన అవసరం లేదన్న చర్చ ఆపార్టీ ముఖ్య నేతల్లో జరిగింది. అయితే సోనియాగాంధీ రాజ్యసభకు వెళ్తారన్న చర్చ కూడా కొనసాగుతోంది. ఈ పరిణామాలతో ఆమె ఇక్కడి నుంచి పోటీ చేయకపోతే బరిలో దింపాల్సిన బలమైన నేత ఎవరన్నది ఆ పార్టీకి పెద్ద తలనొప్పిగా మారనుంది. ఉమ్మడి జిల్లాకు చెందిన పార్టీ ముఖ్య నేతల కుటుంబీకులతో పాటు, పార్టీ పట్ల తొలి నుంచి విధేయత చూపుతున్న ఇతర జిల్లాలకు చెందిన సీనియర్ నేతలు కూడా ఈ టికెట్ ఆశిస్తుండడం గమనార్హం.

గెలుపు సులువనే భావన..

రాష్ట్రంలో నల్లగొండ, భువనగిరి పార్లమెంట్ స్థానాలతో పాటు ఖమ్మం సీటు రాజకీయం కాంగ్రెస్ పార్టీలో హీటెక్కిస్తోంది. ఇక్కడి టికెట్ దక్కించుకుంటే విజయం నల్లేరుమీద నడకేనన్న భావన ఆశావహుల్లో వ్యక్తమవుతోంది. ప్రధానంగా ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఆరు చోట్ల కాంగ్రెస్, పొత్తులో భాగంగా కొత్తగూడెంలో సీపీఐ విజయఢంకా మోగించాయి. అంతేకాకుండా అసెంబ్లీలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు పోలైన ఓట్లను పరిశీలిస్తే భారీ వ్యత్యాసం ఉంది. ఆరు అసెంబ్లీ స్థానాల పరిధిలో కాంగ్రెస్, ఒక స్థానంలో సీపీఐకి కలిపి మొత్తంగా 7,33,293 ఓట్లు, బీఆర్‌ఎస్‌కి 4,67,639 ఓట్లు పోలయ్యాయి. ఏడు అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల మధ్య 2,65,654 ఓట్ల తేడా ఉంది. ఈ విశ్లేషణతో కాంగ్రెస్ పార్టీలోని ఆశావహులు ఖమ్మం పార్లమెంట్ టికెట్ దక్కించుకోవాలన్న ప్రయత్నాల్లో ఉన్నారు. టికెట్ దక్కితే విజయం సునాయాసంగా వరిస్తుందన్న ధీమా వారిలో వ్యక్తమవుతోంది. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఆపార్టీ నేతలే కాకుండా ఇతర జిల్లాలకు చెందిన నేతలు కూడా తమ సామాజిక వర్గం ఓట్లను పరిగణనలోకి తీసుకొని పోటీకి సై అంటున్నారు.

దరఖాస్తు అయితే చేశాం..

పార్లమెంట్ ఎన్నికల్లో పోటీకి ఆశావహుల నుంచి కాంగ్రెస్ పార్టీ గత నెల 30 నుంచి శనివారం వరకు గాంధీభవన్‌లో దరఖాస్తులు స్వీకరించింది. పార్టీ నేత రేణుకాచౌదరి టికెట్ మళ్లీ తనకే ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నారు. అలాగే డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సతీమణి నందిని, మంత్రి పొంగులేటి సోదరుడు ప్రసాద్‌రెడ్డి, వి.హన్మంతరావు, ప్రముఖ వ్యాపారవేత్త వంకాలయపాటి రాజేంద్రప్రసాద్, నాగా సీతారాములు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, రాయల నాగేశ్వరరావు, మద్ది శ్రీనివాస్‌రెడ్డితో పాటు పలువురు నేతలు గాంధీభవన్‌లో దరఖాస్తులు సమర్పించిన వారిలో ఉన్నారు. దరఖాస్తు చేసుకున్న నేతలంతా సోనియాగాంధీ ఈ స్థానం నుంచి పోటీ చేయకపోతే తమకే టికెట్ దక్కాలన్న ప్రయత్నాల్లో ఏఐసీసీ ముఖ్య నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ముఖ్య నేతల కుటుంబీకులు కూడా టికెట్ కోసం దరఖాస్తు చేయడంతో.. పార్టీ ఎవరికి టికెట్ కట్టబెడుతుందోనని కేడర్‌లో చర్చ ప్రారంభమైంది.

వనసమారాధనతో ఆటవిడుపు

జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.ఎస్. జగ్జీవన్ కుమార్

ఖమ్మం లీగల్ : నిత్యం అనేక కేసులతో మానసిక ఒత్తిడికి గురవుతున్న న్యాయవాదులకు వనసమారాధన ఆటవిడుపు కలిగిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ఎస్.జగ్జీవన్‌కుమార్ అన్నారు. ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు ఆధ్వర్యంలో స్థానిక చెరుకూరి వారి మామిడితోటలో ఆదివారం వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా జడ్జి మాట్లాడుతూ.. ప్రకృతి ఒడిలో సేద తీరడంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. న్యాయవాదుల సహకారంతో అనేక పెండింగ్ కేసులు పరిష్కరించామని, కక్షిదారులకు సత్వర న్యాయం అందించడంలో న్యాయవాదుల సహకారం అవసరమని అన్నారు. బార్ కౌన్సిల్ సభ్యులు మాట్లాడుతూ.. న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. కోర్టులో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేసిన జిల్లా ప్రధాన న్యాయమూర్తికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, పాటలు ఆకట్టుకున్నాయి. డాక్టర్ శశిశ్రీ ఆలపించిన చట్టం, న్యాయం, ధర్మం అనే గేయం ఆలోచింపజేసింది. ఇటీవల జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన ఖమ్మం న్యాయవాది అన్నవరపు వెంకటేశ్వరరావు కుమారుడు రవిశంకరతో పాటు సీనియర్ న్యాయవాదులను, కళాకారులను ఈ సందర్భంగా న్యాయమూర్తి సత్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు బసవయ్య, లక్ష్మీనారాయణ, విజయ రాఘవ, వెంకట్, లక్ష్మి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

వయసు నిర్ధారణలో అప్రమత్తంగా ఉండాలి

సీనియర్ సివిల్ జడ్జి జావెద్ పాషా

ఖమ్మంలీగల్ : ఎవరినైనా నేరారోపణపై అరెస్టు చేసి జైలుకు పంపించేటప్పుడు సదరు వ్యక్తి వయసు నిర్ధారణ విషయంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ జావెద్ పాషా అన్నారు. దానవాయిగూడెంలోని జిల్లా జైలును ఆదివారం ఆయన సందర్శించారు. విచారణ ముద్దాయిలు, శిక్ష అనుభవిస్తున్న వారి వయసుపై ఆరా తీశారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ప్రస్తుతం జైల్లో ఉంటున్న వారు బాలలా, పెద్ద వారా అని పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు. నేరానికి పాల్పడ్డారని ఆరోపిస్తున్న సమయంలో సదరు ముద్దాయి వయసు ఎంత అని వారినే అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరిని వ్యక్తిగతంగా పరిశీలించడం ద్వారా వారు 18 సంవత్సరాల లోపు ఉన్నారా అనే విషయాన్ని కూడా గుర్తించవచ్చని చెప్పారు. న్యాయమూర్తి పర్యటన సందర్భంగా మహిళా ఖైదీల బ్యారక్ లో ఒక ముద్దాయి తన వయస్సు 17 సంవత్సరాలు అని చెప్పడంతో సమగ్ర విచారణ నిర్వహించి నివేదిక సమర్పించాలని జైలు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జైలు సిబ్బంది సక్రూ నాయక్, మోహన్ రావు, సుబ్రహ్మణ్యం, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే తత్వం అలవడుతుంది

'చెమట పూల తోట' పుస్తకావిష్కరణలో వక్తలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

ఖమ్మంగాంధీచౌక్: సమాజంలో నిత్యం జరిగే సంఘటనలపై స్పందిస్తున్న రౌతు రవి రచనలు చదివితే ప్రజల్లో ప్రశ్నించే తత్వం అలవడుతుందని పలువురు వక్తలు అన్నారు. ప్రజలు ఎదుర్కొనే సమస్యలను తన కవిత్వంలో మలచిన 'చెమట పూల తోట' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం స్థానిక జెడ్పీ కార్యాలయంలో నిర్వహించగా.. పలువురు కవులు, రచయితలు, సాహితీవేత్తలు మాట్లాడారు. ప్రజల్లో కదలాడే ప్రశ్నలను తన కవిత్వంలో పొందుపర్చారని అన్నారు. మేడగాని శేషగిరి రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లెనిన్ వేషధారణలో నూతలపాటి అప్పారావు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తొలి ప్రతిని విద్యుత్ పోరాట అమరుడు సత్తెనపల్లి రామకృష్ణ కూతురు, సోదరుడికి అందించారు. కార్యక్రమంలో విరసం అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ, అరుణోదయ నాగన్న, కవులు, రచయితలు కన్నెగంటి వెంకటయ్య, గోపగాని రవీందర్, నందిగామ రత్నకుమార్, సిరికి స్వామి నాయుడు, మువ్వా శ్రీనివాస్, గడల భాస్కర్, శిరంశెట్టి కాంతారావు, అన్వర్, షుకూర్, జగన్, వురిమళ్ల సునంద, లెనిన్ శ్రీనివాస్, నామా పురుషోత్తం, రాచమళ్ల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరుణోదయ నాగన్న, పాగి వెంకన్న, అనుప్రసాద్, మోదుగు గోవిందు, స్వప్న పాడిన పాటలు అలరించాయి.

ఖమ్మం సీపీది ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం



ఖమ్మంలో మాట్లాడుతున్న పోటు రంగారావు

- ప్రజా ఉద్యమాలను అణచివేసేందుకు తప్పుడు కేసులు
- సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

ఖమ్మంమయూరిసెంటర్ : ప్రజా ఉద్యమాల్లో పాల్గొంటూ, ప్రజలకు జరిగే అన్యాయాన్ని ప్రశ్నించే తమ పార్టీ నాయకులపై ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అక్రమ కేసులు బనాయిస్తున్నారని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. ఆయనది ఆర్‌ఎస్‌ఎస్ భావజాలమని ఆరోపించారు. ఆదివారం రంగారావు ఖమ్మంలో విలేకరులతో మాట్లాడారు. తమ పార్టీ నాయకులపై పెట్టిన కేసులు, సీపీ వ్యాఖ్యలు చూస్తుంటే ప్రజా ఉద్యమాల పట్ల కక్షతో ఉన్నట్టుగా తెలుస్తోందన్నారు. గతంలో కొత్తగూడెంలో తమ పార్టీ నాయకుడు లింగన్నను పథకం ప్రకారం హత్య చేయించారని, అనేక మందిని ఎన్‌కౌంటర్ పేరుతో హత్య చేయించారని ఆరోపించారు. ఖమ్మంలో రెండు రోజుల క్రితం మరో నాయకుడు సీవై పుల్లయ్యపై కొందరు మద్యం తాగి అనుచిత వ్యాఖ్యలతో పాటు దాడి చేశారని, ఈ ఘటనలో తమ పార్టీ వారి తప్పు లేకున్నా సీపీ జోక్యం చేసుకొని సీరియస్ కేసుగా నమోదు చేసి ఆరుగురిని అక్రమంగా అరెస్ట్ చేశారని చెప్పారు. రౌడీ షీటర్, నేర ప్రవృత్తి గలవారు హోటల్‌పై దాడి చేశారంటూ సీపీ ప్రకటన చేశారని, ఇది తీవ్ర అవమానకరమని అన్నారు. తమ నాయకులు ఏ నేరప్రవృత్తి కలిగినవారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గంజాయి వ్యాపారం చేశామా, భూ ఆక్రమణలకు పాల్పడ్డామా, మట్టి అక్రమ తవ్వకాల్లో పాల్గొన్నామా అని ప్రశ్నించారు. ప్రజల పక్షాన పోరాడుతూ, అన్యాయం జరిగితే ఎదిరించే తమను రౌడీ షీటర్లు, నేర ప్రవృత్తి కలిగిన వారు అని సంబోధిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కేసీఆర్ పాలనలో ప్రజా ఉద్యమాలు అణచివేశారని, ఈ ప్రభుత్వంలోనైనా ప్రజాస్వామికంగా ఉండాలని రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇటీవల ఖమ్మంలో తమ కార్యాలయానికి వచ్చినప్పుడు కోరామని, అందుకు వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. మరి ఇప్పుడు అక్రమ కేసులు బనాయించడమే ప్రజాస్వామ్యమా అని మంత్రులను ప్రశ్నించారు. సీపీపై చర్యలు తీసుకోవాలని కోరారు. తమపై ఎన్ని కేసులు పెట్టినా ప్రశ్నించడం, పోరాడటం మానుకోబోమని తెలిపారు. అక్రమ కేసులు ఎత్తివేయడంతో పాటు సీపీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల, జిల్లా కేంద్రాల్లో నిరసన చేస్తామన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, కమ్మకోమటి నాగేశ్వరరావు, ఝాన్సీ, మంగతాయి, బందెల వెంకయ్య, అర్జున్‌రావు పాల్గొన్నారు.

పాలేరు రిజర్వాయర్‌ను పరిశీలించిన సీఈ



అధికారులతో మాట్లాడుతున్న విద్యాసాగర్

కూసుమంచి : పాలేరు రిజర్వాయర్‌ను ఆదివారం రాత్రి జలవనరుల శాఖ సీఈ విద్యాసాగర్ పరిశీలించారు. రిజర్వాయర్‌కు సాగర్ జలాలు చేరుతుండగా నీటి ప్రవాహం తదితర వివరాలపై ఈఈ మంగళంపూడి వెంకటేశ్వర్లుతో చర్చించారు. కొందరు రైతులు పాలేరు కాలువ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసిన విషయాన్ని ఆరా తీశారు. మరోమారు రైతులు గేట్లు ఎత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. సాగర్ నుంచి వస్తున్న నీరు వృథా కాకుండా చూడాలన్నారు. రిజర్వాయర్‌ను పూర్తి స్థాయిలో నింపి తాగునీటి అవసరాలకు వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

ఎన్‌హెచ్‌గా మార్చితే..



- కొత్తగూడెం-ఖమ్మం మార్గంలో ప్రయాణ సమయం ఆదా
- వివిధ రాష్ట్రాల వాహనాల రాకపోకలతో పెరిగిన రద్దీ
- ఉమ్మడి ఖమ్మం జిల్లా మీదుగా పలు జాతీయ రహదారులు
- కొత్తగా ఆరు రోడ్లకు జాతీయ హోదా కోసం ప్రయత్నాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం : ఉమ్మడి జిల్లాలో రెండు ప్రధాన పట్టణాలైన ఖమ్మం-కొత్తగూడెంల మధ్య ప్రయాణం నరకప్రాయంగా మారింది. పెరిగిన వాహనాల రద్దీకి అనుగుణంగా రోడ్ల విస్తరణ జరగకపోవడంతో ఈ దుస్థితి ఎదురవుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా అనేక రహదారులకు జాతీయ హోదా కల్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ కీలకమైన కొత్తగూడెం - ఖమ్మం రోడ్డు విషయంలో కనీసం ప్రతిపాదనలు కూడా చేయడం లేదు.

ఈ మార్గంలోనే ఏపీ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా వాహనాలు

గడిచిన రెండు దశాబ్దాల కాలంలో జిల్లాలో గణనీయంగా అభివృద్ధి జరిగింది. ప్రజల రాకపోకలు, సరుకు రవాణా పెరిగాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మణుగూరు, భద్రాచలం, పాల్వంచలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్‌కి చెందిన అనేక వాహనాలు హైదరాబాద్‌కు రాకపోకలు సాగించాలంటే కొత్తగూడెం-ఖమ్మం రోడ్డే ప్రధాన దిక్కుగా ఉంది. పుణ్యక్షేత్రమైన భద్రాచలం పట్టణానికి రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారు. ఇలా రాకపోకలు సాగించే వాహనాలకు ఖమ్మం- కొత్తగూడెంల మధ్య ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. ఈ రెండు పట్టణాల మధ్య రోడ్ల సామర్థ్యానికి మించి వాహనాలు నడుస్తున్నాయి. ఫలితంగా వాహనాలు తక్కువ వేగంతో వెళ్లాల్సి వస్తోంది. కొద్ది ప్రయాణానికే ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తోంది.

వీడని నిర్లక్ష్యం

కొత్తగూడెం పట్టణం మీదుగా రెండు జాతీయ రహదారు(ఎన్‌హెచ్)లు వెళ్తున్నాయి. పదిహేనేళ్ల కిందటే విజయవాడ-జగదల్‌పూర్ (ఎన్‌హెచ్ - 30) జాతీయ రహదారిని ప్రకటించారు. దీంతో జిల్లా సరిహద్దులో వీఎం బంజర మొదలు చండ్రుగొండ - కొత్తగూడెం - పాల్వంచ - భద్రాచలం మీదుగా జిల్లా సరిహద్దులు దాటుతుంది. ఈ రోడ్డు మొత్తాన్ని ఎన్‌హెచ్‌గా పూర్తి స్థాయిలో ఆధునీకరించారు. కొత్తగూడెం - ఇల్లెందు మార్గానికి ఇటీవల జాతీయ హోదా దక్కింది. భూసేకరణ, టెండర్ల దశలో పనులు సాగుతున్నాయి. సారపాక - మణుగూరు - ఏటూరునాగారం - కాళేశ్వరం రోడ్డుకు జాతీయ హోదా ఇవ్వాలంటూ ఇప్పటికే కేంద్రానికి ప్రతిపాదనలు వెళ్లాయి. కీలకమైన కొత్తగూడెం - ఖమ్మం రోడ్డుకు జాతీయ హోదా ఇచ్చే విషయంలోనే ఇప్పటికీ నిర్లక్ష్యం కొనసాగుతోంది.

ఉమ్మడి జిల్లా మంత్రులు దృష్టి సారిస్తే మేలు

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర రహదారులకు జాతీయ హోదా కల్పించాలంటూ పద్నాలుగు ప్రతిపాదనలు వెళ్లాయి. తాజాగా రాష్ట్రంలో ఉన్న ఆరు రహదారులకు జాతీయ హోదా కల్పించాలంటూ రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇటీవల కేంద్రమంత్రి నితిన్ గడ్కారీకి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రం నుంచి వెళ్లిన ప్రతిపాదనల్లో చౌటుప్పల్ - సంగారెడ్డి, మరికల్ - రామసముద్రం, పెద్దపల్లి - కాటారం, పుల్లూరు - నల్లగొండ, వనపర్తి - మంత్రాలయం, మన్నెగూడ - బీదర్ రోడ్లు ఉన్నాయి. ప్రస్తుతం కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్తగూడెం - ఖమ్మం రోడ్డుకు జాతీయ హోదా కల్పించే విషయాన్ని ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు దృష్టి సారించాలనే డిమాండ్ ప్రజల నుంచి వస్తోంది.

సుజాతనగర్ టూ తల్లాడ

ప్రస్తుతం ఖమ్మం నుంచి అశ్వారావుపేట వరకు ఉన్న స్టేట్‌హైవే మార్గంలో కొత్తగా ఖమ్మం - దేవరపల్లి (ఎన్‌హెచ్-365బీబీ) గ్రీన్‌ఫీల్డ్ హైవే వస్తోంది. కొత్తగూడెం - ఖమ్మం స్టేట్ హైవే రోడ్డు తల్లాడ దగ్గర ఎన్‌హెచ్ 365ని కలుస్తుంది. ఇప్పటికే కొత్తగూడెం నుంచి సుజాతనగర్ వరకు డబుల్ రోడ్డు అందుబాటులో ఉంది. సుజాతనగర్ నుంచి తల్లాడ వరకు సుమారు 36 నుంచి 40 కి.మీ వరకు ఉన్న మార్గాన్ని జాతీయ రహదారిగా మారిస్తే జిల్లాకు సంబంధించి రోడ్డు మార్గాలు మరో మెట్టు పైకి చేరుకుంటాయి. సుజాతనగర్ - తల్లాడ సెక్షన్‌కు జాతీయ హోదా కల్పిస్తే ఒకేసారి కొత్తగూడెం - భద్రాచలం (ఎన్‌హెచ్- 30), మహబూబాబాద్ - ఇల్లెందు - కొత్తగూడెం (ఎన్‌హెచ్ 930పీ), ఖమ్మం - దేవరపల్లి (ఎన్‌హెచ్ 365)లకు అనుసంధానం ఏర్పడుతుంది. కొత్తగూడెం నుంచి మీదుగా ఖమ్మంతో పాటు హైదరాబాద్ వెళ్లే వాహనాలకు అనవసరపు ట్రాఫిక్ చిక్కులు తగ్గుతాయి. కొత్తగూడెం - ఖమ్మం రోడ్డుతో పాటు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న సారపాక - ఏటూరునాగారం ఎన్‌హెచ్‌పైనా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

క్లుప్తంగా

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ

వైరా: వైరా జేఎంజే యూత్ ఆధ్వర్యంలో బీసీ కాలనీ గ్రౌండ్‌లో ఈ నెల 6 నుంచి రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ బహుమతి రూ. 20,016, ద్వితీయ బహుమతి రూ. 15,016, తృతీయ రూ. 7,016, నాలుగో బహుమతి రూ. 4.016 అందిస్తామని తెలిపారు. ఎంట్రీ ఫీజు రూ.600గా నిర్ణయించామని, ఆసక్తి గల క్రీడాకారులు తమ ఎంట్రీలను సోమవారం వరకు పంపించాలని తెలిపారు. వివరాలకు 81256 66087, 99632 93487 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

బాలుడి అదృశ్యం

కారేపల్లి: మండలంలోని పోలంపల్లి గ్రామానికి చెందిన బాలుడు కనిపించకుండా పోయిన ఘటనపై కారేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. ఎస్‌ఐ రామారావు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బాలుడు భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలోని అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ ప్రథమ సంవత్సరం హాస్టల్‌లో ఉండి చదువుతున్నాడు. గత నెల 23వ తేదీన ఇంటి నుంచి కళాశాల హాస్టల్‌కు వెళ్లిన బాలుడు.. రోజూ కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాతుంటాడు. ఈ నెల 3వ తేదీన హైదరాబాద్ నుంచి ఓ వ్యక్తి ఫోన్ చేసి.. మీ కుమారుడి పదో తరగతి ఒరిజినల్ మెమోతో పాటు, మరికొన్ని సర్టిఫికెట్లు దొరికాయని తెలిపాడు. దీంతో కంగారు పడిన తల్లిదండ్రులు బాలుడికి ఫోన్ చేయగా.. స్విచ్ఛాఫ్ రావటంతో కళాశాలకు ఫోన్ చేసి వాకబు చేయగా బాలుడు అసలు హాస్టల్‌కే రాలేదని తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో ఆరా తీయగా ఆచూకీ లభించలేదు. ఆదివారం బాలుడి తండ్రి బాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యంపై కేసు

కామేపల్లి: మహిళ కనిపించకుండా పోయిన ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. పింజరమడుగు గ్రామానికి చెందిన వివాహిత కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ నెల 2న ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్ల వద్ద, చుట్టుపక్కల వెతికినా లాభం లేకపోయింది. ఆమె భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

కొణిజర్ల: భర్త, అత్త మామల వేధింపులు తాళలేక వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన మండలంలోని మల్లుపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శంకర్‌రావు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దండుగుల సుధాకర్‌తో దండుగుల శిరీష (24)కు ఎనిమిదేళ్ల కిందట వివాహం జరిగింది. కాగా, భర్త సుధాకర్, మామ వెంకటేశ్వర్లు, అత్త లక్ష్మి తరచూ శిరీషను వేధింపులకు గురి చేస్తున్నారు. పలుమార్లు పంచాయితీ నిర్వహించినా వారి ప్రవర్తనలో మార్పు రాలేదు. ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో శిరీష చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి సంపంగి నరసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ శంకరరావు తెలిపారు.

ఆర్థిక సమస్యలతో మహిళ..

ఖమ్మంరూరల్: మండలంలోని నాయుడుపేటకు చెందిన మల్లెబోయిన రమాదేవి (34) శనివారం రాత్రి ఎలుకలమందు తాగింది. పోలీసుల కథనం ప్రకారం.. రమాదేవి కొంత కాలంగా ఆర్థిక సమస్యలతో బాధపడుతోంది. తీవ్ర మనస్తాపం చెందిన ఆమె ఎలుకలమందు తాగగా గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి ఆదివారం మృతిచెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఖమ్మంక్రైం: ఖమ్మం రైల్వే యార్డు సమీపంలో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి (40) గూడ్సు రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు పోలీసులకు లభించలేదు. ఆ వ్యక్తి చేతిపై అంజమ్మ అనే పచ్చబొట్టు ఉందని రైల్వే ఎస్‌ఐ భాస్కర్‌రావు తెలిపారు. మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ నిర్వాహకులు అన్నం శ్రీనివాసరావు సాయంతో మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతుని గురించి తెలిసిన వారు 8712658589 నంబర్‌కు ఫోన్ చేయాలని ఎస్‌ఐ భాస్కర్‌రావు తెలిపారు.

మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: మనస్తాపానికి గురైన ఓ యువకుడు టాబ్లెట్లు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కె.నగేశ్ (30) ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో ఖమ్మం, హైదరాబాద్‌లోని పలు వైద్యశాలల్లో చికిత్స అందించి ఆదివారం ఇంటికి తీసుకొచ్చారు. దీంతో మనస్తాపం చెందిన నగేశ్ ఇంట్లోని టాబ్లెట్లు మింగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు గమనించి నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించాక ఖమ్మం తరలించారు.

దాబాల్లో అసాంఘిక చర్యలు!

మందుబాబులకు అడ్డా అవే..
- తెల్లవార్లూ అనుమతి లేకుండా మద్యం విక్రయం
- మద్యం మత్తులో యువకుల వీరంగం
- చోద్యం చూస్తున్న పోలీసులు, ఎక్సైజ్ అధికారులు


రాడ్లు, కర్రలతో ఆస్పత్రిలోకి వస్తున్న యువకులు

ఖమ్మంక్రైం: ఖమ్మం నగర శివారు ప్రాంతాలైన ఖమ్మంరూరల్, అర్బన్ పరిధిలో కొన్నేళ్లుగా నడుస్తున్న దాబాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారిపోయినట్లు తెలుస్తోంది. ఇక్కడ ఏ సమయంలోనైనా మద్యం దొరుకుతుందని, తెల్లవార్లు కూడా తాగొచ్చని సమాచారం. దీంతో యువకులు బ్యాచ్‌లుబ్యాచ్‌లుగా చేరుకొని మద్యం సేవించి ఘర్షణలకు దిగటంతోపాటు ఒకరికొకరు గాయపర్చుకుంటున్నారు. చిలికిచిలికి గాలివానలా మారి ఘర్షణలు తీవ్రరూపం దాలుస్తున్నాయి. ఒకరివెంట ఒకరు పడుతూ ఎంతదూరమైనా వెళ్లి దాడి చేసేందుకు వెనుకాడటం లేదు. మద్యం మత్తులోనే ఇదంతా చేస్తున్నట్లు తెలుస్తోంది. అందుకు ఖమ్మం రూరల్ పరిధిలోని ఓ దాబాలో రెండు బ్యాచ్‌ల మధ్య శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన ఓ ఘర్షణ ఉదాహరణగా నిలుస్తోంది. ఇక్కడ ప్రారంభమైన వాగ్వాదం ఘర్షణకు దారితీసింది. అక్కడి నుంచి ఒకరి వెంట ఒకరు పడి రోగులు చికిత్స పొందుతున్న జిల్లా ఆస్పత్రికి చేరి, తీవ్రంగా ఘర్షణ పడ్డారు. చివరకు యూనిఫాంలో ఉన్న ఎస్‌ఐ, కానిస్టేబుళ్లపైనా దాడి చేశారు. ఈ ఘటన జిల్లావ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

రాజకీయ నాయకుల అండ, పోలీసుల మామూళ్లతో..?

కమిషనరేట్ పరిధిలో దాబాలు రాజకీయ నాయకుల అండదండలతో నడుస్తున్నట్లు విమర్శలు వినపడుతున్నాయి. దాబాల్లో అధిక శాతం ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్, ఆ తర్వాత అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలోనే ఉన్నాయి. ప్రతి నెల పోలీసులకు మామూళ్లు, రాజకీయ నాయకుల అండదండలతో నడుస్తుండటంతో ఎవరూ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ అనుమతితో ఒక్క బార్లలోనే అర్ధరాత్రి 12 గంటల వరకు మద్యం విక్రయించే అవకాశం ఉంది. కానీ, ఎలాంటి అనుమతులు లేకుండా తెల్లవార్లు దాబాల్లో మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం. దీంతో యువత అంతా డాబాలకు వెళ్లటం ఓ ఫ్యాషన్‌గా మారింది. అక్కడికి వెళ్లి మద్యం సేవించి, సేవించి దానికి బానిసలుగా మారుతున్నట్లు తెలుస్తోంది. అయితే, అక్రమంగా మద్యం విక్రయించి ఎక్సైజ్ శాఖ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నా ఆ శాఖ అధికారులు కూడా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.

ప్రధాన రహదారుల వెంట..

ప్రధాన రహదారుల వెంట దాబాలు ఒక సమయం లేకుండా విచ్చలవిడిగా తెల్లవార్లు తీసి ఉండటంతో వాహనదారులు ఆగి.. మద్యం సేవించి, మత్తులో రోడ్డు ప్రమాదాలకు కారకులవుతున్నారు. నగర శివారులో దాబాలు ఎంత జోష్‌గా నడుస్తున్నాయంటే ఇక్కడి వారే కాకుండా ఒడిశా, మధ్యప్రదేశ్ నుంచి వచ్చినవారు సైతం దాబాలు నడిపి రూ.లక్షలు సంపాదిస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పోలీస్ అధికారులు ఇప్పటికైనా స్పందించి ఈ దాబాల్లో జరిగే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని, దాబాల్లో మద్యం విక్రయించకుండా చూడాలని, అర్ధరాత్రి వరకు నడిపిస్తున్న దాబాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లా ఆస్పత్రిలో గ్యాంగ్‌వార్..

అడ్డుకోబోయిన రూరల్ ఎస్‌ఐపై దాడి


ఆస్పత్రిలో గాయపడిన ఎస్‌ఐ సురేశ్

ఖమ్మంరూరల్ మండలంలోని ఓ దాబా వద్ద జరిగిన ఘర్షణ కాస్తా నగరంలో జిల్లా ఆస్పత్రిలో గ్యాంగ్‌వార్‌కు దారితీసింది. ఓ వర్గం వారు బీభత్సం సృష్టించారు. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి తర్వాత చోటుచేసుకుంది. ఖమ్మంరూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వరంగల్ క్రాస్‌రోడ్డు ప్రాంతంలో ఉన్న దాబా వద్ద అదే మండలంలోని తెల్దారుపల్లి, నగరంలోని రేవతి థియేటర్ ప్రాంతానికి చెందిన యువకుల మధ్య మద్యం మత్తులో ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. దీంతో రూరల్ ఎస్‌ఐ సురేశ్ ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వ్యక్తిని జిల్లా ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆయన తెల్దారుపల్లికి చెందిన వ్యక్తి కావడంతో అతడి వెంట ఉన్న వారు ఆస్పత్రికి వచ్చారు. ఈలోపు వీరితో ఘర్షణ పడిన నగరానికి చెందిన రేవతి సెంటర్ నుంచి సుమారు 50 మందికిపైగా ఓ గ్యాంగ్ ఆస్పత్రికి రాడ్లు, కర్రలు, రాళ్లతో చేరుకుని, తెల్దారుపల్లికి చెందిన వారితో ఘర్షణ పడ్డారు. దాడి చేశారు. అక్కడే ఉన్న రూరల్ ఎస్‌ఐ సురేశ్ వారికి సర్ది చెబుతుండగా రేవతి థియేటర్ ప్రాంతానికి చెందిన కొందరు ఎస్‌ఐని వెనుక నుంచి గట్టిగా పట్టుకోగా మరికొందరు దాడికి దిగారు. అడ్డువచ్చిన కానిస్టేబుల్‌పై కూడా దాడిచేశారు. కొద్దిసేపు జిల్లా ఆస్పత్రిలో బీభత్సం సృష్టించారు. దీంతో ఆస్పత్రిలోని సిబ్బంది, రోగులు భయభ్రాంతులకు గురయ్యారు. కాగా, ఎస్‌ఐపై దాడి ఘటనలో ప్రతిపక్ష పార్టీకి చెందిన ఓ యువకుడు కీలకపాత్ర పోషించాడని పోలీసులు అనుమానిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు భారీగా చేరుకొని అక్కడివారిని చెదరగొట్టారు. అనంతరం ఎస్‌ఐ, కానిస్టేబుల్‌కు చికిత్స చేయించారు.

సీపీ తీవ్ర ఆగ్రహం!

ఈ ఘటనపై పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఎస్‌ఐపై దాడి చేసినవారు ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. దీంతో రంగంలోకి దిగిన టూటౌన్ పోలీసులు జిల్లా ఆస్పత్రిలో బీభత్సం సృష్టించిన వారిని గుర్తించటానికి సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ప్రమాదాలకు కారణం..


గొడవ జరిగిన దాబా ఇదే

ఖమ్మంరూరల్: ఖమ్మంరూరల్ మండలంలో అనధికారికంగా నడుస్తున్న దాబాలు, రెస్టారెంట్లలో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. కోదాడ క్రాస్‌రోడ్, ఏదులాపురం క్రాస్ రోడ్, వెంకటగిరి ప్రాంతాల్లో ప్రధాన రోడ్ల పక్కన వందల కొద్దీ దాబాలున్నాయి. నిబంధనల ప్రకారం వీటిల్లో మద్యం విక్రయించొద్దు. బయటి నుంచి మద్యం తెచ్చుకొని సేవించొద్దు. కానీ నిర్వాహకులకు ఇవేమీ పట్టడం లేదు. యథేచ్ఛగా మద్యం విక్రయిస్తూ.. సిట్టింగ్‌లకు అనుమతి ఇస్తున్నట్లు సమాచారం. ఉదయం నుంచి రాత్రి ఒంటి గంట వరకు కూడా దాబాలు, హోటళ్లు తెరిచే ఉంచడంతో రహదారిపై వెళ్లే వాహనదారులు మద్యం సేవించి ప్రమాదాల బారిన పడుతున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాదిలో ఒక్క రూరల్ మండలంలోనే మద్యం సేవించి ప్రమాదాలకు గురై 20 మంది వరకు మృత్యువాత పడినట్లు గణాంకాలు చెబుతున్నాయి. కానీ, ఇవన్నీ పోలీస్ రికార్డుల్లో మాత్రం మామూలు ప్రమాదాలుగానే ఉంటున్నట్లు సమాచారం.

గంజాయి మత్తు కూడా?

ఏదులాపురం, కోదాడ క్రాస్‌రోడ్, వరంగల్ క్రాస్ రోడ్‌లలో రెండేళ్లుగా కొందరు యువకులు మద్యంతో పాటు గంజాయి మత్తులో తూలుతున్నారు. గతంలో రూరల్ పోలీస్ స్టేషన్‌లో అనేక కేసులు కూడా నమోదయ్యాయి. ఏదులాపురం క్రాస్‌రోడ్‌లోని ఓ బడ్డీ దుకాణంలో గుట్టుచప్పుడు కాకుండా ఓ మహిళ గంజాయి పొట్లాలను నిల్వ ఉంచగా పోలీసులు పట్టుకున్నారు. గత నెలలో ఒడిశాకు చెందిన ఇద్దరు వ్యక్తులు గంజాయి సంచులతో నడుచుకుంటూ వెళ్తుండగా వరంగల్‌క్రాస్ రోడ్ వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ప్రాంతాలన్నీ గంజాయి సరఫరాకు కేంద్రాలుగా మారాయని పలువురు చెబుతున్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా..

జన్మదిన వేడుకల్లో తుమ్మల యుగంధర్


భారీ కేకను కట్ చేస్తున్న తుమ్మల యుగంధర్


రక్తదానం చేస్తున్న తుమ్మల యుగంధర్

ఖమ్మంవన్‌టౌన్: ప్రజల ప్రేమాభిమానాలు మరువలేనివని, నిత్యం అందుబాటులో ఉంటూ అభివృద్ధి, సేవా కార్యక్రమాల్లో పాల్గొంటానని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్ అన్నారు. ఆదివారం ఆయన జన్మదినం సందర్భంగా నగరంలోని సప్తపది ఫంక్షన్ హాల్లో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ప్రముఖ పిల్లల వైద్యుడు కూరపాటి ప్రదీప్‌కుమార్ ప్రారంభించగా సుమారు 500 మంది అభిమానులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా యుగంధర్ మాట్లాడుతూ.. తనపై అభిమానంతో ఇన్ని వందల మంది రక్తదానం చేయడం గర్వంగా ఉందని, ఇది ఎందరో తలసేమియా వ్యాధిగ్రస్తులకు ఉపయోగపడుతుందని తెలిపారు. తొలుత జన్మదినం సందర్భంగా భారీ కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ జావీద్, కార్పొరేటర్లు కమర్తపు మురళి, మలీదు జగన్, మలీదు వెంకటేశ్వర్లు, చావా మాధురి, మిక్కిలినేని మంజుల, రావూరి కరుణ, సాధు రమేశ్‌రెడ్డి, నాగండ్ల దీపక్‌చౌదరి, ఆశ్రీఫ్, పోట్ల వీరేందర్, తుపాకుల యలగొండల స్వామి, కొంగర జ్యోతిర్మయి, బోయినపల్లి లక్ష్మణ్‌గౌడ్, పత్తి శ్రీనివాస్, బానాల లక్ష్మణ్, అబ్దుల్ రషీద్, బొమ్మ ఉదయ్, నాళం సతీశ్, చల్లా ప్రతిభ, స్వరూపారాణి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై దాడి

ఖమ్మంరూరల్: మండలంలోని కోదాడ క్రాస్ రోడ్‌లో రమేశ్‌దాబా–2లో శనివారం అర్ధరాత్రి మద్యం మత్తులో ఇరు వర్గాలు ఘర్షణ పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. తెల్దారుపల్లికి చెందిన ఇనుప రాంబాబు పని ముగించుకొని స్నేహితులతో కలిసి భోజనం చేయడానికి దాబాకు వచ్చారు. అదే సమయంలో కొందరు వ్యక్తులు దాబా యజమానితో గొడవ పడుతున్నారు. అనంతరం తాము కూడా బిల్లు కట్టేందుకు వెళ్లగా ఖమ్మం నగరం రేవతిసెంటర్‌కు చెందిన ఉదయ్, నజీర్, విజేత, ప్రశాంత్, ఉపేందర్, హుసేన్, మరికొందరు అకారణంగా రాంబాబుపై కర్రలతో దాడికి పాల్పడగా తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయంలో దాబా యజమాని రమేశ్ కూడా చూస్తూ పక్కనే ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ విషయమై బాధితుడు రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కూలీకి గాయాలు

కామేపల్లి: ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో వలస కూలీకి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. శనివారం రాత్రి అబ్బాసుపురం గ్రామం నుంచి ముచ్చర్ల క్రాస్ రోడ్డు వైపు మహారాష్ట్ర నుంచి వలస వచ్చిన కూలీలు రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్నారు. సాతానిగూడెం గ్రామానికి చెందిన ప్రసాద్ ద్విచక్ర వాహనంపై ముచ్చర్ల క్రాస్ రోడ్డు వైపు వెళ్తూ వెనుక నుంచి సంకేత్ అనే వ్యక్తిని ఢీకొట్టాడు. దీంతో సంకేత్ తొంటికి తీవ్ర గాయమైంది. స్థానికులు ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

బైక్ కిందపడటంతో వ్యక్తికి...

కామేపల్లి: ద్విచక్రవాహనం అదుపుతప్పి పల్టీ కొట్టడంతో వ్యక్తికి గాయాలైన ఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. పాపటపల్లి గ్రామానికి చెందిన ఎం.నాగరాజు పాతలింగాల గ్రామం హాస్టల్‌లో ఉన్న తన కుమార్తెను చూసి ఇంటికి తిరిగి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా గోవింద్రాల బంజర స్టేజీ సమీపంలో అదుపుతప్పి కిందపడింది. గాయపడిన నాగరాజును 108లో వైద్యం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వసతులు లేవంటూ విద్యార్థుల ఆందోళన

ఎస్టీ బాలుర కళాశాల వసతిగృహం ఎదుట నిరసన


విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న ఏటీడీఓ జహీరుద్దీన్

ఖమ్మంమయూరిసెంటర్ : వసతిగృహంలో సౌకర్యాలు సక్రమంగా అందడం లేదని, తాగునీరు, మెనూ ప్రకారం భోజనం అందడం లేదని హాస్టల్ ఎదుట విద్యార్థులు ఆదివారం ఆందోళనకు దిగారు. నగరంలోని ఎస్టీ బాలుర కళాశాల వసతిగృహం విద్యార్థులు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు నిరసన చేపట్టారు. వసతిగృహంలో సౌకర్యాలు కల్పించాలని, నీటి ట్యాంకులు నిర్మించాలని డిమాండ్ చేశారు. గదులు శుభ్రం చేయడం లేదని, అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఏటీడీఓ జహీరుద్దీన్ అక్కడికి చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు ఆందోళనను విరమించారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ అధికారులతో మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చొరవ చూపాలని కోరారు.

మతిస్థిమితం లేని వ్యక్తిపై దాడి

చింతకాని: మతిస్థిమితం లేని వ్యక్తిపై మండలంలోని నాగులవంచ గ్రామంలో కొందరు యువకులు శనివారం అర్ధరాత్రి దాడి చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలో జరుగుతున్న రైల్వే మూడో లైన్, రెండు జాతీయ రహదారి నిర్మాణ పనుల నిమిత్తం ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన అనేక మంది కార్మికులు మండలానికి వచ్చారు. ఇటీవలి కాలంలో చిన్నపిల్లలను ఎత్తుకెళ్లి దాడిచేస్తున్న ఇతర ప్రాంతాలకు చెందిన వీడియోలను పలువురు సోషల్ మీడియా గ్రూపుల్లో పెడుతున్నారు. దీంతో ఈ ప్రాంతంలో తిరుగుతున్న తెలుగు భాష రాని కొత్త వ్యక్తులను, మతిస్థిమితం లేని వారిపై దాడి చేస్తున్నారు. నాగులవంచ గ్రామంలోని కొందరు యువకులు మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న ఏపీలోని ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన వ్యక్తిపై శనివారం అర్ధరాత్రి దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అపస్మారక స్థితిలో ఉన్న మతిస్థిమితం లేని వ్యక్తిని పోలీసులు అన్నం సేవాసమితి ద్వారా ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. వైద్య పరీక్షల అనంతరం అన్నం సేవా సమితి వ్యవస్థాపకులు అన్నం శ్రీనివాసరావు తన సేవాసదన్‌కు తీసుకెళ్లినట్లు తెలిపారు. మండలంలో వారం వ్యవధిలో ఇలాంటి ఘటనలు మూడు జరగటం గమనార్హం.

ట్రాక్టర్ బోల్తా

- ద్విచక్రవాహనదారుడు మృతి
- 11 మంది కూలీలకు, ఆరుగురు చిన్నారులకు గాయాలు


గాయపడిన మహిళలను తరలిస్తున్న దృశ్యం

బోనకల్: డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో ట్రాక్టర్ పల్టీ కొట్టగా అదే సమయంలో ట్రాక్టర్‌ను ఓవర్ టేక్ చేస్తున్న ద్విచక్రవాహనదారుడు ట్రాక్టర్ కిందపడి మృతి చెందాడు. 11 మంది కూలీలు, మరో ఆరుగురు చిన్నారులు గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం రాత్రి బోనకల్ ఆర్‌ఓబీపై చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని రావినూతల గ్రామానికి చెందిన 16 మంది కూలీలు ముదిగొండ మండలం బాణాపురం గ్రామంలో మిర్చిలో తాలు కాయలు ఏరేందుకు వెళ్లి వస్తున్నారు. బోనకల్ రైల్వే ఓవర్ బ్రిడ్జి మీదకు రాగానే డ్రైవర్ ఒక్కసారిగా సడన్ బ్రేకు వేయడంతో ట్రాక్టర్ ట్రక్కు అదుపు తప్పి పక్కనే వస్తున్న ద్విచక్రవాహనదారుడు యండ్రాతి వెంకటేశ్వర్లు (45)పై పడింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. ట్రక్కులో ఉన్న బోయినపల్లి ఉమ, చేబ్రోలు మంగమ్మ, బోయినపల్లి రమ్య, బంధం ఉమ, భాగ్యలక్ష్మి, నాగేంద్ర, కృష్ణవేణి, భూలక్ష్మి, నాగమణి, నాగరాణితో పాటు మరో ఆరుగురు చిన్నారులకు గాయాలయ్యాయి. మృతుడు వెంకటేశ్వర్లుకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోచారంతండాలో క్షుద్రపూజల కలకలం

ఇల్లెందురూరల్: మండలంలోని పోచారంతండా గ్రామపంచాయతీలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన క్షుద్రపూజలు కలకలం సృష్టించాయి. పోచారంతండా నుంచి గుండాల మండలం శెట్టుపల్లి గ్రామానికి వెళ్లే దారిలో వైకుంఠధామం పక్కన ఇస్లావత్ శంకర్ (సూర్య) వ్యవసాయ భూమిలో గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్రపూజలు నిర్వహించారు. పొలంలో పెద్ద రాయిని దేవత మాదిరిగా అలంకరించి, అక్కడే ఒక మేక పోతును, పందిని నరికి, తలకాయలను రాయి ముందు పెట్టారు. పట్టిన రక్తాన్ని ఒక మట్టి కుండలో పోసి దేవత ముందు పెట్టారు. పసుపు, కుంకుమతో పూజలు చేసినట్లు ఆనవాళ్లు ఆ ప్రదేశంలో కనిపిస్తున్నాయి. రెండు జీవాలను విగ్రహానికి సమీపంలోని నేలలో పూడ్చినట్లు తవ్వకాలు కనిపిస్తున్నాయి. ఈ దృశ్యాన్ని ఉదయమే మేకలను తోలుకొని అడవిలోకి వెళ్తున్న మేకల కాపరులు చూసి గ్రామపెద్దలకు సమాచారం అందించారు. గ్రామంలోని కొంతమంది అక్కడికి చేరుకొని క్షుద్రపూజలు చేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. పొలం యజమాని శంకర్‌కు సమాచారం అందించారు. ఈ ఘటన స్థానికులను భయాందోళనకు గురిచేసింది. ఈ విషయమై కొమరారం ఎస్‌ఐ గిరిధర్‌రెడ్డిని వివరణ కోరగా.. ఘటనా స్థలాన్ని సందర్శించి విచారణ ప్రారంభించామని చెప్పారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

తిరుమలాయపాలెం: పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటనపై ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఇస్లావత్‌తండాకు చెందిన ఇస్లావత్ బాలాజీ (52)కి తీవ్రమైన కడుపునొప్పి వస్తుండడంతో ఈ నెల 1న ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి భార్య కొన్నేళ్ల కిందట మృతిచెందగా ముగ్గురు కుమారులున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

నేలకొండపల్లిలో మరో యువకుడు...

నేలకొండపల్లి: చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని ఆరెగూడెంనికి చెందిన బి.విసేశ్(23) గత నెల 31న పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఆస్పత్రిలో చేర్పించాక మెరుగైన వైద్యంకోసం హైదరాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.

రైతుకు పాముకాటు

కామేపల్లి: మండలంలోని భాసిత్‌నగర్ గ్రామానికి చెందిన బాదావత్ స్వామి ఆదివారం కల్లంలో మిర్చిని ఆరబెడుతున్న క్రమంలో పాము కాటుకు గురయ్యాడు. స్థానికులు అతన్ని వెంటనే 108లో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చింతకాని: మండలంలోని చినమండవ మున్నేరు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను జగన్నాథపురం గ్రామ సమీపంలో పట్టుకుని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాజేందర్ తెలిపారు.

ఎదురుకాల్పుల్లో మావోయిస్టు మృతి

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా నాగారం – పంతభేజీ అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఓ మావోయిస్టు మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. కొంట ఏరియా కమిటీ ఏసీఎం సోదిగజేంద్ర, ఏసీఎం పోడియంహద్మా, కొంట లాస్ కమాండర్ దుర్రో కోసితో సహా 15 నుంచి 20 మంది మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో డీఆర్‌జీ, బస్తర్ ఫైటర్స్, సీఆర్పీఎఫ్ 219 బలగాలు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో నాగారం – పంతభేజీ అడవుల్లో ఉన్న మావోయిస్టులు భద్రతా బలగాలపై కాల్పులు జరిపారు. వెంటనే తేరుకున్న భద్రతా బలగాలు ఎదురుకాల్పులు జరపడంతో ఇరువర్గాల మధ్య హోరాహోరీ కాల్పులు జరిగాయి. అనంతరం ఘటనా స్థలంలో బలగాలు గాలించగా మావోయిస్టు మృతదేహం కనిపించింది. అక్కడి నుంచి మృతదేహంతోపాటు 12 బోర్ రైఫిల్‌లు, సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి...


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

అశ్వాపురం: మండలంలోని బీజీకొత్తూరు – సీతారాంపురం గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. పాల్వంచవాసిగా భావిస్తున్న వ్యక్తి బైక్‌పై అశ్వాపురం వైపు వస్తుండగా సీతారాంపురం గ్రామ సమీపంలో టాటా ఏస్ వాహనం బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఎస్‌ఐ తిరుపతిరావు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

క్లుప్తంగా...

నేటి నుంచి ఏపీ అసెంబ్లీ, మండలి సమావేశాలు

7న ఓటాన్ అకౌంట్ బడ్జెట్

సాక్షి, అమరావతి: ఏపీ శాసనసభ, శాసన మండలి సమావేశాలు సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్నాయి. ఉభయ సభల సభ్యు లను ఉద్దేశించి గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ప్రసంగంతో ఈ సమావేశాలు ప్రారంభమవుతాయి. అనంతరం శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ సమావేశమై ఈ సమావేశాలు ఎప్పటి వరకు నిర్వహించాలనేది నిర్ణయించనుంది. అదేవిధంగా త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ నెల 7వ తేదీన ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. అంతకుముందు ఈ ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ఆమోదించడానికి ఏడో తేదీ ఉదయం 8గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధ్యక్షతన సచివాలయంలో కేబినెట్ సమావేశం జరగనుంది.

నక్సల్ ఉద్యమం లేకుంటే తెలంగాణ ఉద్యమమేలేదు

- టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి

సాక్షి, హైదరాబాద్: నక్సల్ ఉద్యమం లేకుంటే తెలంగాణ ఉద్యమమేలేదని టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి అన్నారు. తెలంగాణ సమాజంలో ఉన్న అసమానతల కారణంగానే యువత తిరుగుబాటు బావుటా ఎగురవేసిందని పేర్కొన్నారు. మంగళారపు లక్ష్మణ్ రాసిన 'మాయని గాయాల నెత్తుటి చరిత్ర(యథార్థ సంఘటనల సమాహారం) పుస్తక పరిచయ కార్యక్రమాన్ని ఆదివారం ఇక్కడి రవీంద్రభారతి మినీహాలులో నిర్వహించారు. చక్రపాణి మాట్లాడుతూ తెలంగాణ ప్రజలను నక్సల్స్ ఉద్యమమే విముక్తిబాట పట్టించిందనే నిజాన్ని సమాజానికి చెప్పాలని సూచించారు. ఆకలి ఉన్న వారితోపాటు ఆకలిబాధ తెలిసిన ఎంతోమంది నక్సల్ ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. చరిత్రలో జరిగిన విధ్వంసాన్ని, ఉద్యమాలను ప్రజలకు తెలిపేందుకు ప్రత్యేక పుస్తకాలు రావాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ నీటి వనరుల అభివృద్ధి కార్పొరేషన్ తొలి చైర్మన్ వీరమల్లు ప్రకాశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యమస్ఫూర్తిని చంపేశారని, మళ్లీ అది రావాలన్నారు. ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ ఉన్నత చదువులు చదువుకున్న ఎంతోమంది తెలుగునాట జరిగిన నక్సల్ బరి ఉద్యమంలో ప్రాణాలు త్యాగం చేశారన్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్, రచయిత జకీర్, పుస్తక రచయిత మంగళారపు లక్ష్మణ్, రచయిత డాక్టర్‌వైదల పాల్గొన్నారు.

తప్పు.. మీదంటే మీదే

- విద్యాశాఖలో ఇద్దరు అధికారుల మధ్య వాగ్వాదం !
- డిప్యుటేషన్లపై ఆరా తీసిన సీఎంఓ
- సమగ్ర నివేదిక కోరిన రాష్ట్ర ప్రభుత్వం .. డిప్యుటేషన్లపై ఉపాధ్యాయ సంఘాల మండిపాటు



సాక్షి, హైదరాబాద్: విద్యాశాఖలో డిప్యుటేషన్ల వ్యవహారం చిచ్చురేపుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి కార్యాలయం రంగంలోకి దిగింది. సమగ్ర వివరాలు అందించాలంటూ ఉన్నతాధికారులను ఆదేశించింది. ఇదే సమయంలో ఇష్టానుసారంగా డిప్యుటేషన్లు ఇస్తున్నారంటూ ఉపాధ్యాయ సంఘాల నేతలు కూడా మండిపడుతున్నాయి. సీఎంకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పలు సంఘాల నేతలు ఈ వ్యవహారంపై సీఎం కార్యాలయానికి ఫిర్యాదులు పంపారు. సాధారణ బదిలీలు చేపట్టకుండా, అయినవారు, ముడుపులు ఇచ్చి న వారిని కోరుకున్న ప్రాంతానికి పంపుతున్నారని సంఘ నేతలు ఆరోపిస్తున్నారు. దీనిపై 'సాక్షి'లో టీచర్లు సిటీకి.. చదువులు గాలికి'అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ వార్తపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, అంతర్గత విచారణకు ఆదేశించినట్టు తెలిసింది.

కొత్త వివాదానికి దారి తీస్తున్న డిప్యుటేషన్లు

టీచర్ల డిప్యుటేషన్ అంశం అధికారుల మధ్య కొత్త వివాదానికి దారి తీస్తోంది. విద్యాశాఖలో ఉన్నతాధికారులు కొంతమంది ఈ తంతుతో తమకు సంబంధమే లేదని చెబుతున్నారు. తాను వ్యతిరేకించినా డిప్యుటేషన్ ఆర్డర్ ఎలా వచ్చిందో తెలియదని ఓ అధికారిణి తెలిపారు. కీలకమైన బాధ్యతల్లో ఉన్నా, ప్రేక్షక పాత్ర పోషించాల్సి వస్తోందని ఆమె నిస్సహాయత వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే, విద్యాశాఖ ఉన్నతాధికారి మాత్రం ఈ వాదనతో ఏకీభవించడం లేదు. ఫైల్ సంబంధిత అధికారిణి ద్వారానే తనకు వస్తుందని, ఆమెకు తెలియకుండా ఎలా ఉంటుందని ప్రశ్నిస్తున్నారు. మానవతాకోణంలో బదిలీలు చేస్తున్న విషయాన్ని ఆమె ఎందుకు పక్కదారి పట్టిస్తున్నారో తెలియడం లేదని విద్యాశాఖ ఉన్నతాధికారి అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఇద్దరి మధ్య వాగ్వాదం కూడా జరిగినట్టు విద్యాశాఖ వర్గాల సమాచారం. పరస్పరం సీఎంఓకు ఫిర్యాదులు చేసుకుంటున్న వైనం విద్యాశాఖలో చర్చనీయాంశమైంది.

రంగంలోకి మధ్యవర్తులు

తీవ్ర విమర్శలు వస్తున్నా డిప్యుటేషన్ వ్యవహారం ఆగడం లేదు. ఆసిఫాబాద్ నుంచి మంచిర్యాలకు గత నెల 11వ తేదీన ఓ టీచర్‌ను డిప్యుటేషన్ ఇస్తూ ఇచ్చిన ఉత్తర్వులు తాజాగా వెలుగులోకి వచ్చాయి. ఇవే కాకుండా మరికొన్ని డిప్యుటేషన్లు ఇవ్వడానికి రంగం సిద్ధమైందని ఉపాధ్యాయవర్గాల్లో చర్చ జరుగుతోంది. డిప్యుటేషన్ల బేరసారాలు పలు జిల్లాల్లో జోరుగా సాగుతున్నాయని టీచర్లు అంటున్నారు. అనారోగ్య సర్టిఫికెట్లు సృష్టించి మరీ డిప్యుటేషన్లు ఇప్పిస్తామని నమ్మబలుకుతున్నారని వారు చెబుతున్నారు. కొంతమంది రాజకీయ పలుకుబడిని ముందుకు తెస్తుంటే, మరికొంతమంది తమకు విద్యాశాఖలో ఉన్నతాధికారి తెలుసునని, ఆయనకు కొంత ముట్టజెబితే డిప్యుటేషన్ సులభమని నమ్మిస్తున్నారని పలువురు టీచర్లు తెలిపారు.

ప్రభుత్వం విశ్వసనీయత నిలుపుకోవాలి

ఉపాధ్యాయుల బదిలీల్లో పారదర్శకత పాటించి విశ్వసనీయతను కాపాడుకోవాలి. పలుకుబడి కలిగిన ఉపాధ్యాయులకు డిప్యుటేషన్ పేరిట జిల్లాలు దాటించి బదిలీలు చేయటం సమంజసం కాదు. అనారోగ్యం, భార్యభర్తలు తదితర సహేతుక కారణాలతో బదిలీలు చేయాలనుకుంటే ఒక విధానపరమైన నిర్ణయం తీసుకుని అవసరమైన, అర్హులైన ఉపాధ్యాయులకు అవకాశం ఇవ్వటం సమంజసం. ఉపాధ్యాయులు బదిలీలకోసం అడ్డదారులు తొక్కే పరిస్థితి కల్పించారు. నూతనంగా ఏర్పాటైన ప్రజా ప్రభుత్వంలో అటువంటి పరిస్థితి రాకూడదని కోరుకుంటున్నాం.

– చావా రవి,
టీఎస్ యూటీఎఫ్ ప్రధానకార్యదర్శి

2,002 ఎకరాల్లో బల్క్‌డ్రగ్ పార్క్

నక్కపల్లి వద్ద రూ.1,235 కోట్లతో ఏర్పాటు



సాక్షి, అమరావతి: అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద 2,001.8 ఎకరాల్లో బల్క్‌డ్రగ్ పార్క్ రూపుదిద్దుకోనుంది. ఈ బల్క్‌డ్రగ్ పార్కును ఈపీసీ విధానంలో నిర్మించడానికి ఏపీఐఐసీ టెండర్లు పిలిచింది. రూ.1,234.75 కోట్లతో బల్క్‌డ్రగ్ పార్కును డిజైన్ చేసి అభివృద్ధి చేసే విధంగా ఆసక్తిగల సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానించింది. 2001.8 ఎకరాల్లో.. 139.07 ఎకరాల్లో ఉన్న చెరువులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఈ పార్కును అభివృద్ధి చేయనున్నారు. అభివృద్ధి చేసిన పార్కులో 1,009.85 ఎకరాల్లో ఫార్మా పరిశ్రమలు, 595.4 ఎకరాల్లో ఏపీఐ–డీఐఎస్ సింథసిస్, 414.1 ఎకరాల్లో ఫెర్మిటేషన్స్, 150 ఎకరాలు ఇతర వాణిజ్య అవసరాలకు వినియోగించే విధంగా ఈ పార్కును అభివృద్ధి చేయనున్నారు. మార్చి 18 నాటికి బిడ్డింగ్ ప్రక్రియ పూర్తిచేసి పనులు అప్పగించనున్నారు. చైనా నుంచి ఫార్మా దిగుమతులను తగ్గించుకోవాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం మూడు బల్క్‌డ్రగ్ పార్కులను ఏర్పాటు చేయడానికి ముందుకొస్తే.. 16 రాష్ట్రాలతో పోటీపడి ఆంధ్రప్రదేశ్ ఈ పార్కును కైవసం చేసుకున్న విషయం విదితమే. తొలుత కాకినాడ వద్ద నిర్మించడానికి ప్రయత్నం చేయగా పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేయాలన్న నిబంధన మేరకు నక్కపల్లి వద్ద పార్కును అభివృద్ధి చేస్తున్నారు.

ఫార్మాహబ్‌గా ఏపీ: ఈ బల్క్‌డ్రగ్ పార్కుతో రాష్ట్రం ఫార్మాహబ్‌గా ఎదగనుంది. ఇప్పటికే రాష్ట్రంలో 300కు పైగా ఫార్మా కంపెనీలున్నాయి. ఈ బల్క్‌డ్రగ్ పార్కు అందుబాటులోకి వస్తే 100కు పైగా ఫార్మా కంపెనీలు కొత్తగా ఏర్పాటవుతాయని అంచనా వేస్తున్నారు. వీటిద్వారా 27,360 మందికి ప్రత్యక్షంగా ఉపాధికి లభిస్తుందని అంచనా. ప్రస్తుతం దేశీయ ఫార్మా ఉత్పత్తుల్లో రాష్ట్రం 16 శాతం వాటాతో మూడోస్థానంలో ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో రూ.41,500 కోట్ల విలువైన ఫార్మా ఉత్పత్తులు వస్తుండగా.. అందులో రూ.8,300 కోట్లకు పైగా ఎగుమతులు జరుగుతున్నాయని అంచనా. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2,400 ఎకరాల్లో అభివృద్ధి చేసిన జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీలో ఇప్పటికే మైలాన్, ఫైజర్, డాక్టర్ రెడ్డీస్, అరబిందో వంటి 60కి పైగా దిగ్గజసంస్థలు ఉన్నాయి. కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఈ బల్క్‌డ్రగ్ పార్కు అందుబాటులోకి వస్తే అంతర్జాతీయ కంపెనీలు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ప్రజా రవాణాను కాపాడుకోవాలి

తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరామ్

మన్సూరాబాద్: ప్రజా రవాణాను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ) రాష్ట్ర మహాసభ ఎల్‌బీనగర్ హిమగిరి గార్డెన్స్‌లో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ చందర్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ యూనియన్లు లేకుంటే కార్మిక వ్యవస్థ లేదని, కార్మికుల కష్టనష్టాల్లో యూనియన్ల పాత్ర కీలకమన్నారు. ఆర్టీసీలో యూనియన్ల పునరుద్ధరణకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. యూనియన్లు లేకపోతే కట్టు బానిలం అవుతామని స్పష్టంచేశారు. ఆర్టీసీ ఆస్తులను ఆక్రమించుకునేందుకే గత ప్రభుత్వం విలీన ప్రక్రియ చేపట్టిందని ఆరోపించారు. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీకి పూర్వ వైభవం వచ్చిందని, కార్మికులకు రావాల్సిన బాకాయిలను ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కారానికి ప్రయత్నిస్తానని తెలిపారు. ఆర్టీసీ టీఎంయూ మహాసభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అశ్వథ్థామరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెల్ఫేర్ కమిటీని రద్దు చేసి యూనియన్ పునరుద్ధరచేయాలనేది ప్రధాన డిమాండ్ అన్నారు.



హాజరైన ఆర్టీసీ కార్మికులు

స్థానిక సంస్థల్లో 50 శాతానికి రిజర్వేషన్లు పెంచాలి

మంత్రి కోమటిరెడ్డికి ఆర్.కృష్ణయ్య వినతి



కాచిగూడ (హైదరాబాద్): స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను 22 శాతం నుంచి 50 శాతానికి పెంచాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం బీసీ సంక్షేమ సంఘ ప్రతినిధులతో కలిసి కృష్ణయ్య మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ...గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 22 శాతంకు తగ్గించారన్నారు. కులగణనకు వెంటనే చర్యలు తీసుకోవాలని, విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లపై ఉన్న క్రీమిలేయర్ తొలగించాలని కోరారు. బీసీల్లో ప్రతి కులానికి ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సీబీఐ విచారణలో కాకాణికి క్లీన్‌చిట్

- నెల్లూరు న్యాయస్థానంలో చోరీతో ఆయనకు సంబంధం లేదు
- చార్జిషీట్ దాఖలు చేసిన సీబీఐ

సాక్షి, అమరావతి: నెల్లూరు న్యాయస్థానంలో ఫైళ్ల గల్లంతైన కేసులో వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ క్లీన్ చిట్ ఇచ్చింది. ఫైళ్ల గల్లంతు వ్యవహారంతో కాకాణికి ఏమాత్రం సంబంధం లేదని, ఈ కేసులో ఏపీ పోలీసులు సక్రమంగానే దర్యాప్తు చేశారని తేల్చిచెప్పింది. రాష్ట్ర పోలీసులు దర్యాప్తు జరిపి నిందితులుగా పేర్కొన్న సయ్యద్ హాయత్, షేక్ ఖాజా అనే ఇద్దరు వ్యక్తులే నెల్లూరు న్యాయస్థానంలో ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలతోపాటు ఫైళ్లను కూడా అపహరించినట్లు నిర్ధారించింది. మంత్రి కాకాణి ఆ ఫైళ్లను దొంగతనం చేయించారన్న టీడీపీ ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేసింది. ఈమేరకు విజయవాడలోని ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జ్–మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ న్యాయస్థానంలో సీబీఐ దాఖలు చేసిన చార్జిషీట్ తాజాగా వెలుగులోకి వచ్చింది. నెల్లూరులోని నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 2022 ఏప్రిల్ 13 రాత్రి కొందరు ఆగంతకులు దొంగతనానికి పాల్పడి ఎలక్ట్రానిక్ ఉపకరణాలతోపాటు పలు పత్రాలను అపహరించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దొంగతనానికి పాల్పడ్డ సయ్యద్ హాయత్, షేక్ ఖాజాలను అరెస్ట్ చేసి వారి నుంచి ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలను స్వాధీనం చేసుకున్నారు. వారిద్దరిని అరెస్ట్ చేసి న్యాయస్థానం ఆదేశాలతో రిమాండ్‌కు పంపారు. ఈ ఉదంతంపై టీడీపీ సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి వ్యతిరేకంగా న్యాయస్థానంలో దాఖలైన కేసులో ఆధారాలను గల్లంతు చేసేందుకు చోరీకి పురిగొల్పారని అభాండాలు వేశారు. ఈ ఆరోపణలను తిప్పికొట్టిన మంత్రి కాకాణి దీనిపై సీబీఐ విచారణకు సిద్ధమని ప్రకటించారు. న్యాయస్థానం ఆదేశాలతో సీబీఐ దర్యాప్తు జరిపి 403 పేజీల చార్జిషీట్‌ను కోర్టుకు సమర్పించింది.

జిల్లా వార్తలు

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి

ఒకరోజు ఆదాయం రూ.37,315



జలాశయంలో బోటు షికారు చేస్తున్న ట్రైనీ ఎస్పీలు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భారీగా తరలివచ్చారు. డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 625 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.20, 215, 250 మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ.17,100 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

కిన్నెరసానిలో ట్రైనీ ఎస్పీలు..

కొత్తగూడెం జిల్లాలో ప్రొహిబిషన్ ఎస్పీ విక్రమ్ కుమార్ సింగ్, సూర్యాపేట జిల్లాకు చెందిన ప్రొహిబిషన్ ఎస్పీ ఆదివారం కిన్నెరసానిని సందర్శించారు. జలాశయంలో బోటుషికారు చేశారు.

రాష్ట్ర లీగల్ చీఫ్ అడ్వైజర్‌గా 'తాళ్లపల్లి'

రఘునాథపాలెం: తెలంగాణ క్లస్టర్ రిసోర్స్ పర్సన్ అసోసియేషన్ రాష్ట్ర చీఫ్ అడ్వైజర్‌గా మండలంలోని బూడిదంపాడుకు చెందిన తాళ్లపల్లి వెంకటరత్నంను నియమించారు. సంఘం రాష్ట్ర స్థాయి సమావేశం ఆదివారం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగుల కృష్ణారెడ్డి, తిరుందాసు సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించగా, ఈ మేరకు వెంకటరత్నాన్ని ఎన్నుకున్నారు. ఆయన మంచుకొండ కాంప్లెక్స్‌లో సీఆర్పీగా విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర కమిటీలో ఖమ్మం జిల్లాకు సముచిత స్థానం కల్పించినందుకు రాష్ట్ర కమిటీకి, సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు చిలక ప్రభాకర్, రాష్ట్ర మహిళా కమిటీ కోశాధికారి మారుతీ నిర్మలాదేవి, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు మోలుగురి వీరయ్య, ప్రధాన కార్యదర్శి కనకపూడి బాబురావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

అంతర పంటలతో ఆసరా..

- ఆయిల్‌పామ్ తోటల్లో సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం
- ఎక్కువగా ఉద్యాన, అపరాలు, నూనెగింజల పంటలు
- పత్తి, మొక్కజొన్న పంటలపైనా రైతుల ఆసక్తి
- ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో విస్తారంగా సాగు..





ఆయిల్ పామ్ తోటలో అంతర పంటగా మొక్కజొన్న (ఇన్‌సెట్) అంతర పంటగా వేసిన కాకర

ఖమ్మంవ్యవసాయం: ఉద్యాన పంటలకు ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వాలు, ఆయా పంటల్లో అంతర పంటల సాగును కూడా ప్రోత్సహిస్తున్నాయి. రాష్ట్రంలో ఉద్యాన పంటలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా పెట్టింది పేరు. మామిడి, ఆయిల్ పామ్ తోటలు ఇక్కడే అధికంగా సాగవుతున్నాయి. ఉమ్మడి జిల్లా నేలలు, నీటి వనరులు అనుకూలంగా ఉండడమే ఇందుకు కారణంగా చెప్పొచ్చు. మామిడి, ఆయిల్ పామ్ వంటి ఉద్యాన, నూనె గింజల పంటల్లో మొదటి నాలుగైదు సంవత్సరాల పాటు అంతర పాంటల సాగుకు అవకాశం ఉంటుంది. ప్రధాన పంట ఫలితాలు ఇచ్చే వరకు వానాకాలం, యాసంగి సీజన్లలో రైతులు ఇతర పంటలను సాగు చేస్తూ ఆదాయం పొందుతున్నారు.

నూనె గింజల సాగు పెంచేలా..

వంట నూనెల ఉత్పత్తిలో భారత్ బాగా వెనకబడి ఉంది. వివిధ దేశాల నుంచి నూనెలు దిగుమతి చేసుకుంటుండగా ఈ పరిస్థితిని అధిగమించేందుకు నూనె గింజల పంటలకు ప్రాధాన్యత పెంచాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు జాతీయ నూనె గింజల ఉత్పత్తి పథకాన్ని అమలు చేస్తూ పంట విస్తీర్ణాన్ని పెంచుతోంది. దీంతో రాష్ట్రంలో ఉన్న నేలల రకాలు, వాతావరణ పరిస్థితుల ఆధారంగా ఆయిల్ పామ్ తోటల సాగుకు ప్రాధాన్యం పెరిగింది. ఆయిల్ పామ్ సాగు చేసిన ఐదేళ్ల తరువాత ఉత్పత్తి ప్రారంభమవుతుంది. దీంతో తొలి నాలుగైదేళ్లు అంతర పంటల సాగుకు అవకాశం ఉంది. ఈ పంటల సాగుకు కూడా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. మొదటి నాలుగుళ్ల పాటు అంతర పంటల సాగుకు ఎకరాకు రూ. 2,100 చొప్పున రైతులకు అందిస్తున్నారు. వీటితో పాటు ఆయిల్ పామ్ తోట యాజమాన్యానికి మరో రూ. 2,100 ఆయా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు.

ప్రాంతాన్ని బట్టి పంటలు..

ఆయిల్ పామ్ తోటల్లో అంతర పంటలుగా ప్రాంతాలను బట్టి రైతులు భిన్నమైన పంటలు సాగు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని సత్తుపల్లి, పెనుబల్లి, వేంసూరు, తల్లాడ, కల్లూరు, అశ్వారావుపేట, దుమ్ముగూడెం, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ తదితర మండలాల్లో అరటి, బొప్పాయి, జామ, కూరగాయల పంటలు, మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, కొణిజర్ల, రఘునాథపాలెం,ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం, కూసుమంచి, వైరా, ఏన్కూరు, జూలూరుపాడు, సుజాతనగర్, కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు, పినపాక తదితర మండలాల్లో మొక్కజొన్న పత్తి, మిరప, బొప్పాయి, పెసర, కంది, మినుము, అలసంద, నువ్వులు, బొబ్బెర్లు, వేరుశనగ, పొద్దు తిరుగుడు, కుసుమ, కూరగాయల పంటలు సాగు చేస్తున్నారు.

తక్కువ పెట్టుబడితో..

అంతర పంటల సాగులో తక్కువ పెట్టుబడితో రైతులు మంచి ఆదాయాన్ని గడిస్తున్నారు. ప్రధాన పంట కోసం చేసే దుక్కి పనులతో పాటు ఎరువులు, నీటి యాజమాన్యం అంతర పంటలకూ ఉపయోగపడుతుంది. ఇక విత్తనాల కొనుగోలు, నాటడం, అంతర పంటల యాజమాన్య పద్ధతులను అవలంభించడం వంటి పనులు మాత్రమే రైతులు చేయాల్సి ఉంటుంది. ఇలా ఏడాదికి రెండు పంటలు తీస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో లక్ష ఎకరాలకు పైగా అంతర పంటల సాగు ఉండగా, దీనిలో ఆయిల్ పామ్ తోటల్లోనే 87,561 ఎకరాల్లో ఉందని అధికారులు చెబుతున్నారు. ఖమ్మం జిల్లాలో 22,941 ఎకరాల్లో, భద్రాద్రి జిల్లాలో 64,620 ఎకరాల్లో ఈ పంటలు సాగు చేస్తుండగా.. ప్రభుత్వ ప్రోత్సాహకం కింద ఎకరాకు రూ. 2,100 చొప్పున రైతులు పొందుతున్నారు.

ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటల సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)

జిల్లా	2021-22	2022-23	2023-24	మొత్తం
ఖమ్మం	7,397	11,273	4,271	22,941
భద్రాద్రి	38,792	16,495	9,333	64,620
మొత్తం	46,189	27,768	13,604	87,561

అంతర పంటలతో ఆదాయం



8 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నాం. అంతర పంటలుగా డ్రాగన్ ఫ్రూట్, యాపిల్ బేర్, సీతాఫలం, తైవాన్ జామ, కూరగాయల పంటలు సాగు చేస్తున్నాం. దీంతో మంచి ఆదాయం వస్తోంది. మా పంటల సాగును గుర్తించి కేంద్ర ప్రభుత్వం గణతంత్ర వేడుకల్లో ఢిల్లీకి ఆహ్వానించి సత్కరించి ప్రశంసపత్రం అందించింది. దీంతో మంచి గుర్తింపు లభించింది.

– పెనుబల్లి లక్ష్మీగంగరాజు, అర్లగూడెం, దుమ్ముగూడెం మండలం

కాలాన్ని బట్టి పంటలు



నాలుగు ఎకరాల్లో ఆయిల్ పామ్ తోటను సాగు చేస్తున్నా. ఈ తోటలో వానాకాలంలో పత్తి, యాసంగిలో పెసర, మొక్కజొన్న, దోస పంటలు సాగు చేస్తున్నా. అంతర పంటలు మంచి ఫలితాన్ని ఇస్తున్నాయి. మొక్కజొన్న ద్వారా ఎకరాకు రూ. 50 వేలకు పైగా ఆదాయం వస్తోంది. పెసర, దోస పంట ద్వారా కూడా ఆదాయం వస్తుంది.

– శీలం రాఘవరెడ్డి, కుర్నవెల్లి, తల్లాడ మండలం

ప్రాధాన్యత పెరిగింది



సంప్రదాయ పంటలకు భిన్నంగా రైతులు ఆదాయ పంటల సాగుకు మొగ్గు చూపుతున్నారు. నేలలు, నీటి వనరులు, మార్కెటింగ్ వంటి సౌకర్యాలతో ఈ ప్రాంతంలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. అంతర పంటల సాగుకు కూడా ప్రాధాన్యం పెరిగింది. ప్రభుత్వం ఆయిల్ పామ్ తోటల్లో అతర పంటల సాగును ప్రోత్సహిస్తోంది.

– జినుగు మరియన్న, ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి, భద్రాద్రి జిల్లా

ప్రశాంతంగా సీఓఈ ప్రవేశ పరీక్ష



కూసుమంచి పరీక్ష కేంద్రంలో పర్యవేక్షిస్తున్న ఆర్‌సీఓ ప్రత్యూష



కారేపల్లి సోషల్ వెల్ఫేర్ గురుకుల కళాశాల ఎదుట విద్యార్థుల సందడి

ఖమ్మం రీజియన్‌లో 9,667 మందికి గాను 9,351 మంది హాజరు

ఖమ్మంమయూరిసెంటర్ : ఎస్సీ సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) జూనియర్ కళాశాలల్లో 2024 – 25 విద్యా సంవత్సరంలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ప్రస్తుతం పదో తరగతి చదువుతూ 2024 – 25 విద్యా సంవత్సరంలో సీఓఈ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ కోర్సుల్లో విద్యనభ్యసించేందుకు మాత్రమే ప్రవేశం కల్పించనున్నారు. ఖమ్మం రీజియన్‌లోని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల పరిధిలోని 26 కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించారు. ఈ ప్రవేశ పరీక్షలు రాసేందుకు 9,667 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 9,351 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షలకు హాజరు కాగా, 316 మంది గైర్హాజరయ్యారు. ఎస్సీ గురుకులాల జాయింట్ సెక్రటరీ శారద, ఖమ్మం రీజియన్ కో ఆర్డినేటర్ ప్రత్యూష రీజియన్‌లోని పరీక్ష కేంద్రాలను సందర్శించి పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా పర్యవేక్షించారు.

- ఖమ్మం జిల్లాలో 4,566 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా.. 13 కేంద్రాల్లో నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 4,428 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో బాలురు 1,650 మంది కాగా, బాలికలు 2,778 మంది ఉన్నారు. 138 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.
- భద్రాద్రి జిల్లాలో 8 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. 2,611 మంది విద్యార్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకోగా.. 2,509 మంది పరీక్ష రాశారు. వీరిలో బాలురు 826, బాలికలు 1,683 మంది ఉన్నారు. 102 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.
- మహబూబాబాద్ జిల్లాలో 5 కేంద్రాల్లో పరీక్షను నిర్వహించారు. 2,490 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా.. 2,414 మంది పరీక్ష రాశారు. వీరిలో బాలురు 916 మంది, బాలికలు 1,498 మంది ఉన్నారు. 76 మంది గైర్హాజరయ్యారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

- రాష్ట్రంలో విద్యా జిల్లాలు ఏర్పాటుచేయాలి
- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

నేలకొండపల్లి : రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. నేలకొండపల్లిలో ఆదివారం టీఎస్ యూటీఎఫ్ జిల్లా స్థాయి విస్తృత సమావేశం జరగగా, ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సర్కారు బడులను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ఒకే సంఖ్యలో పాఠశాలలు, విద్యార్థులు లేరని, వారి సంఖ్యకు అనుగుణంగా విద్యా జిల్లాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 80 శాతం పాఠశాలల పర్యవేక్షణ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. పేద విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పాలకులు రాజ్యాంగ విలువలకు తూట్లు పొడుస్తున్నారని ఆరోపించారు. సమైక్య స్ఫూర్తిని దెబ్బతీసేలా నిధుల విడుదలలో కోత పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొఠారి కమిషన్ సూచనల ప్రకారం కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 10 శాతం కేటాయించాలని కోరారు. జాతీయ విద్యా విధానం పేరుతో ప్రభుత్వ విద్యారంగాన్ని దెబ్బతీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతం అయితే పేద పిల్లలకు నాణ్యమైన బోధన అందుతుందన్నారు. అనంతరం ప్రభుత్వ విద్యపై నేలకొండపల్లి హైస్కూల్ విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది. సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగమల్లేశ్వరరావు, పి.నాగేశ్వరరావు, నాయకులు నెల్లూరి వీరబాబు, జియా ఉద్దీన్, తొర్తి గురవయ్య, నవాబ్‌సాహెబ్, సుంతర మోని నాగార్జున, అరవింద్, గోవిందరావు, మంగ పతిరావు తదితరులు పాల్గొన్నారు.